నమస్తే తెలంగాణ

# హైదరాబాద్

హైదరాబాద్- మేడ్చల్

15 | హైదరాబాద్,శుక్రవారం 26 జనవరి 2024 | HYDERABAD




**తిరంగా యాత్ర** | గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని.. గురువారం చార్మినార్ వద్ద తిరంగా యాత్ర నిర్వహించారు. అతిపెద్ద మువ్వన్నెల జెండాతో ఈ ప్రదర్శన సాగింది.

## జైలర్ యడారి రామయ్యకు రాష్ట్రపతి అవార్డు

మాదన్నపేట, జనవరి 25: చంచల్‌గూడ జైలులో జైలర్‌గా విధులు నిర్వహిస్తున్న యడారి రామయ్యకు ప్రెసిడెంట్ మెరిటోరియస్ సర్వీస్ అవార్డు వచ్చింది. ఈ సందర్భంగా జైళ్ల శాఖ డీజీ సౌమ్య మిశ్రా, హోం సెక్రటరీ జితేందర్, ఐజీలు రాజేశ్, మురళీ బాబు, డీఐజీ శ్రీనివాస్ తదితరులు అభినందించారు.



రామయ్యను అభినందిస్తున్న జైళ్ల శాఖ డీజీ సౌమ్య మిశ్రా

# మద్యం మత్తు.. అతివేగం

### ఉద్యోగం వచ్చిందన్న ఆనందంలో స్నేహితులకు ట్రీట్

**నిండు ప్రాణాన్ని బలితీసుకున్న యువకుడు**

**జూబ్లీహిల్స్ హిట్ అండ్ రన్ కేసును ఛేదించిన పోలీసులు**

**ప్రధాన నిందితుడితో పాటు స్నేహితుల అరెస్టు**

బంజారాహిల్స్, జనవరి 25: సంచలనం సృష్టించిన జూబ్లీహిల్స్ హిట్ అండ్ రన్ కేసును పోలీసులు ఛేదించారు. ప్రధాన నిందితుడితో పాటు అతడి స్నేహితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. గురువారం జూబ్లీహిల్స్ పీఎస్‌లో ఏసీపీ హరిప్రసాద్, డీఐ వీరశంకర్ వివరాలను వెల్లడించారు. సిక్‌విలేజ్ సమీపంలోని గాంధీనగర్‌కు చెందిన లింగాల తారక్‌రామ్(30) బౌన్సర్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం రాత్రి డ్యూటీ ముగించుకొని బైక్‌పై ఇంటికి వెళ్తున్న తారక్‌రామ్, అతడితో పాటు పనిచేస్తున్న ఏసురాజును మితిమీరిన వేగంతో వచ్చిన కారు ఢీకొట్టిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో తారక్‌రామ్ అక్కడికక్కడే మృతి చెందగా, రాజు తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. కాగా, మృతుడి సోదరి చింతల లీలావతి ఇచ్చిన ఫిర్యాదుతో రంగంలోకి దిగిన జూబ్లీహిల్స్ పోలీసులు.. ప్రమాదానికి కారణమైన కారును గుర్తించారు. సికింద్రాబాద్ సమీపంలోని తుకారామ్‌గేట్‌లో ఉంటున్న కావూరి రుత్విక్‌రెడ్డి(21) మద్యం సేవించి కారు నడిపించి..జూబ్లీహిల్స్‌లో యాక్సిడెంట్ చేసినట్లు విచారణలో తేలింది. రుత్విక్‌రెడ్డికి ఓ సంస్థలో ఉద్యోగం రావడంతో ట్రీట్ ఇస్తానంటూ..మంగళవారం రాత్రి పదిన్నర ప్రాంతంలో తన బావ కారులో స్నేహితులతో కలిసి బయలుదేరాడు. తనకు ఉద్యోగం వచ్చిన ఆఫీసు వద్దకు తీసుకెళ్లి చూపించాడు. వివిధ ప్రాంతాల్లో చక్కర్లు కొట్టిన అనంతరం.. ఇంటికి బయలుదేరాడు. దారిపొడువునా బీర్లు తాగడంతో మత్తులో ఉన్న రుత్విక్‌రెడ్డి..సుమారు 100 కిలోమీటర్ల వేగంతో దూసుకువెళ్తూ.. ఉదయం 5 గంటల సమయంలో జూబ్లీహిల్స్ రోడ్ నం. 36లోని పెద్దమ్మ గుడి వద్ద బైక్‌ను ఢీకొట్టి పారిపోయాడు. అనంతరం రుత్విక్‌రెడ్డి తన స్నేహితులతో కలిసి బాలానగర్ సమీపంలోని ఫిరోజ్‌గూడలో ఉంటున్న తన బంధువు గుడిమెట్ల సురేశ్‌రెడ్డి(27) ఇంటికి వెళ్లారు. జూబ్లీహిల్స్‌లో యాక్సిడెంట్ చేశామని, ఇద్దరు వ్యక్తులను ఢీకొట్టామని చెప్పారు. దీంతో తమ కారును అక్కడే ఉంచాలని సురేశ్‌రెడ్డి సూచించాడు. ప్రమాదం జరిగిన ప్రాంతానికి వెళ్లి ఏం జరిగిందో చూద్దామని, చిన్న ప్రమాదమైతే గాయపడిన వారికి ట్రీట్‌మెంట్ ఇప్పిద్దామంటూ సురేశ్‌రెడ్డి చెప్పి.. వారిని తన కారులో ప్రమాదం జరిగిన ప్రాంతానికి తీసుకొచ్చాడు. అక్కడ భారీగా జనం గుమిగూడి ఉండడంతో పాటు ప్రమాదంలో తారక్‌రామ్ చనిపోయినట్లు తెలుసుకున్న రుత్విక్‌రెడ్డి తదితరులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. జూబ్లీహిల్స్ నుంచి కారు వెళ్లిన రోడ్లపై సీసీ ఫుటేజీని సేకరించిన పోలీసులు నిందితులను గుర్తించారు. మద్యం మత్తులో కారు నడిపిన రుత్విక్‌రెడ్డితో పాటు డ్రంక్ అండ్ డ్రైవ్‌ను ప్రోత్సహించిన అతడి స్నేహితులను కూడా నిందితులుగా చేర్చి వారిని సైతం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.



ప్రధాన నిందితుడు కావూరి రుత్విక్‌రెడ్డి



ప్రమాదంలో దెబ్బతిన్న కారు

## మాజీ మంత్రి కారు బీభత్సం

బంజారాహిల్స్, జనవరి 25: ఎమ్మెల్యే కాలనీలో కారు బీభత్సం సృష్టించింది. మాదాపూర్‌కు చెందిన లైఫ్‌స్పాన్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ యజమాని రామ్ నరేంద్ర గురువారం బంజారాహిల్స్ రోడ్ నం. 12లో ఓ ఆస్పత్రికి పని నిమిత్తం వచ్చారు. కారు డ్రైవర్ శ్రీనివాసులు యజమానిని ఆస్పత్రి వద్ద దింపిన అనంతరం అక్కడ పార్కింగ్ లేకపోవడంతో కొంచెం ముందుకెళ్లి ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ సమీపంలో రోడ్డుపక్కన నిలిపి.. కారులో కూర్చున్నాడు. ఇంతలో అతివేగంతో వచ్చిన మరో కారు ఢీకొట్టడంతో శ్రీనివాసులుకు గాయమైంది. ప్రమాదానికి కారణమైన డ్రైవర్ ప్రభాకర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆ కారు వికారాబాద్ జిల్లాకు చెందిన మాజీ మంత్రి చంద్రశేఖర్‌ది అని దర్యాప్తులో తేలింది.



గురువారం ట్యాంక్ బండ్ పరిసరాల్లో ట్రాఫిక్ రద్దీ

# సిటీ అంతటా.. ట్రాఫిక్ జామ్

### నరకం చూస్తున్న నగరవాసులు


**ఎల్బీస్టేడియంలో కాంగ్రెస్ బూత్ లెవల్ మీటింగ్**

**గమ్యం చేరేందుకు వాహనదారుల అవస్థలు**

*భాగ్యనగరంలో ట్రాఫిక్ అస్తవ్యస్తంగా తయారైంది. గమ్యాన్ని చేరేందుకు వాహనదారులు నరకం చూస్తున్నారు. ఇదిలా ఉంటే ఎల్బీ స్టేడియంలో గురువారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన బూత్ లెవల్ మీటింగ్ నగరవాసుల సహనాన్ని పరీక్షించింది. గమ్యాన్ని చేరుకునేందుకు నానా ఇబ్బందులు పడాల్సి వచ్చింది.*



సిటీబ్యూరో, జనవరి 25 (నమస్తే తెలంగాణ): నగరంలో ట్రాఫిక్ అస్తవ్యస్తంగా తయారైంది. ప్రధాన రహదారుల్లో సిబ్బంది పర్యవేక్షణ లేకపోవడంతో ఎక్కడికక్కడ ట్రాఫిక్ జామ్ అవుతున్నది. ఇలా నగర రోడ్లపై నిత్యం నరకయాతన పడుతున్న ప్రజలకు గురువారం ఎల్బీస్టేడియంలో కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన బూత్ లెవల్ మీటింగ్ మరింత ఇబ్బందులను తెచ్చిపెట్టింది. గంటల తరబడి ట్రాఫిక్ జామ్‌తో నానా అవస్థలుపడాల్సి వచ్చింది. ఈ సమావేశంతో స్టేడియానికి సుమారు రెండు కిలోమీటర్ల పరిధిలో ట్రాఫిక్ రద్దీ ఏర్పడి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సాయంత్రం 5.40 నిమిషాల సమయంలో మీటింగ్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రసంగంతో ముగిసింది. అనంతరం సీఎం రేవంత్, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేలతో పాటు మంత్రులు, ఎమ్మెల్యేలు రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చిన వారంతా స్టేడియం నుంచి బయటకు వచ్చారు. అప్పటికే పరిసరాల్లో ట్రాఫిక్ మళ్లింపుతో ఎక్కడికక్కడ రద్దీ ఏర్పడి.. ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటుండగా, అదే సమయంలో స్టేడియం నుంచి వచ్చిన వారితో ఆ పరిసర ప్రాంతాలు నిండిపోయాయి. దీంతో సాయంత్రం వేళ.. ఇంటికి వెళ్లేవారు ట్రాఫిక్‌లో చిక్కుకొని గోసపడ్డారు. ఇదిలా ఉంటే తెలుగు తల్లి ఫ్లైఓవర్‌పై రాత్రి 7.30 సమయంలో కారు దగ్ధమైంది. ఈ ఘటనతో అప్పటికే ట్రాఫిక్ జామ్‌లో చిక్కుకొని అవస్థలు పడుతున్న వారు మరింత అసహనానికి గురయ్యారు. గంటల తరబడి ట్రాఫిక్‌లో ఇరుక్కుపోయి.. రాత్రి 8 నుంచి 9 గంటల సమయానికి ఇంటికి చేరుకున్నారు. కాగా, గత పదేండ్లలో ఎల్బీ స్టేడియంలో రాజకీయ పార్టీలకు సంబంధించిన సభలు, సమావేశాలు అత్యసరమైతే తప్ప.. అనుమతులు ఇవ్వలేదు. అయితే ప్రస్తుత కాంగ్రెస్ సర్కారు నగర ప్రజల ఇబ్బందులను ఏ మాత్రం పట్టించుకోవడం లేదన్న విమర్శలు వస్తున్నాయి.



### వ్యూస్ పెంచుకునేందుకు..

## అడ్డదారిలో రీల్స్

బంజారాహిల్స్, జనవరి 25: ఇన్‌స్టా రీల్స్‌లో వ్యూస్ పెంచుకునే క్రమంలో డీ మార్ట్ స్టోర్‌లో చాక్లెట్స్ చోరీ చేయడంతో పాటు ఫ్రీగా చాక్లెట్స్ తినడం ఎలా.. అంటూ వీడియోలు చేసిన ఇద్దరిని ఫిలింనగర్ పోలీసులు అరెస్ట్ చేశారు. చందంపేట మండలం నేరేడుగొమ్మ గ్రామానికి చెందిన హనుమాన్ నాయక్(22) రాయదుర్గం సమీపంలో నివాసముంటూ.. ఓ కళాశాలలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్నాడు. అదే ప్రాంతంలో ఉంటున్న ఘట్‌కేసర్‌కు చెందిన సిద్ధూ (25) అనే యువకుడితో కలిసి కొంతకాలంగా ఇన్‌స్టాగ్రామ్‌లో రీల్స్ తయారు చేస్తున్నాడు. ఈ క్రమంలో షేక్‌పేట డీ మార్ట్ స్టోర్‌కు వెళ్లారు. కౌంటర్‌లో ఉన్న రెండు చాక్లెట్స్‌ను తీసుకున్న హనుమాన్ నాయక్ వాటిని తీసుకొని జేబులో పెట్టుకోవడం.. ఒక షర్ట్‌ను తీసుకుని ట్రయల్ రూమ్‌లోకి వెళ్లి చాక్లెట్స్ తినడంతో పాటు వీడియోలు తీసి.. ఇన్‌స్టా రీల్స్‌గా పోస్ట్ చేశారు. ఈ వీడియోలు వైరల్ కావడంతో డీ మార్ట్ యాజమాన్యం దృష్టికి వెళ్లాయి. ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. గురువారం పోలీసులు నిందితులు హనుమాన్ నాయక్, సిద్ధూలను అరెస్ట్ చేశారు.



## పుప్పాలగూడలో హిట్ అండ్ రన్

**ద్విచక్రవాహనదారుడు మృతి**

మణికొండ, జనవరి 25 : అతివేగంతో దూసుకొచ్చిన కారు.. ఓ ద్విచక్రవాహనదారుడిని ఢీకొట్టడంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. నార్సింగి పోలీసుల కథనం ప్రకారం.. సంగారెడ్డి జిల్లా రాంచంద్రాపురం మండలం వెలిమల గ్రామానికి చెందిన రవి(43) ద్విచక్రవాహనంపై ఎల్బీనగర్‌కు వెళ్లి వస్తుండగా. పుప్పాలగూడ సమీపంలో వెనుక నుంచి అతివేగంగా దూసుకువచ్చిన కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రవి దుర్మరణం పాలయ్యాడు. సీసీ కెమెరాల ఆధారంగా నిందితుడిని అరెస్టు చేసి, హిట్ అండ్ రన్ కేసును నమోదు చేసినట్లు సీఐ సతీశ్ తెలిపారు.



**త్రివర్ణ కాంతులు** | గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా జరుపుకొనేందుకు నగరం సిద్ధమైంది. ఈ సందర్భంగా ప్రభుత్వ కార్యాలయాలు, కట్టడాలను మువ్వన్నెల విద్యుత్ కాంతులతో అలంకరించారు. చిత్రంలో త్రివర్ణ వెలుగుల్లో కాచిగూడ రైల్వేస్టేషన్.

### ఆహార ఉత్పత్తుల కోసం అనుమతి

## నకిలీ ఔషధాలు తయారీ

**మరో ఫార్మా కంపెనీ సీజ్**

**రూ. 2.90 లక్షల విలువైన మందులు స్వాధీనం**

సిటీబ్యూరో, జనవరి 25 (నమస్తే తెలంగాణ): నగరంలో నకిలీ ఔషధాల తయారీ కలకలం సృష్టిస్తున్నది. కొన్ని కంపెనీలు ఆహార ఉత్పత్తుల తయారీ కోసం అనుమతులు తీసుకుని నకిలీ ఔషధాలు తయారు చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో డ్రగ్ కంట్రోల్ అథారిటీ అధికారులు కొన్ని రోజులుగా వరుస దాడులు జరుపుతున్నారు. గురువారం కూకట్‌పల్లి, ఐడీపీ ప్రశాంతినగర్‌లోని ఎస్ఎల్ హెల్త్ కేర్‌పై డీసీఏ అధికారులు దాడులు జరిపారు. ఈ కంపెనీ నిబంధనలకు విరుద్ధంగా ఔషధాలను తయారు చేస్తున్నట్లు గుర్తించారు. 'ఆర్థో-డీ', 'ప్రెగవిట్-ఎం'ను రూపొందించి మార్కెట్లో విక్రయిస్తున్నట్లు తేలింది. ఈ ఔషధాలు తయారు చేయాలంటే తప్పనిసరిగా డీసీఏ నుంచి అనుమతులు పొందాల్సి ఉంటుంది. కానీ నిర్వాహకులు నిబంధనలకు విరుద్ధంగా ఆహార ఉత్పత్తుల ముసుగులో అర్హతలేని వారితో ఔషధాలను తయారు చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నట్లు డీసీపీ నిర్ధారించింది. ఈ మేరకు రూ. 2.90 లక్షల విలువైన మందులను సీజ్ చేసినట్లు డ్రగ్ కంట్రోల్ అథారిటీ డీజీ కమలాసన్‌రెడ్డి తెలిపారు.



## ఉప్పల్.. ఊగిపోయింది..

ఉప్పల్ స్టేడియంలో భారత్-ఇంగ్లాండ్ టెస్టు మ్యాచ్ జరుగుతున్నది. ఈ నేపథ్యంలో తొలి రోజు మ్యాచ్‌ను వీక్షించేందుకు క్రికెట్ అభిమానులు భారీగా తరలిరావడంతో సందడి నెలకొంది. ఆటగాళ్ల ఆటను ఆస్వాదిస్తూ.. అభిమానులు కేరింతలు కొట్టారు. స్టేడియంలో పలువురు ప్రేక్షకులు ప్రదర్శించిన ప్లకార్డులు ఆకట్టుకున్నాయి.







